
# చేటపెయ్య



జగన్నాధమంటే ఒకప్పుడు మా వాళ్ళందరికి లోకువ. నేనంటే మన్నన. దానికి కారణం ఉండేది. జగన్నాధమూ నేనూ ఒకే ఊరి-వాళ్ళం ఒకటే కులం. ఇళ్ళ పేర్లు కూడా ఒకటే.

మాకు బోలెడంత భూమీ, పుట్రా ఉండేవి. మా తాత లదగ్గర్నుంచి వ్యవసాయం ఉమ్మడిగా ఉండేది. జగన్నాధం నాన్న మా పొలాల్లో పని-చేసేవాడు. మా తాతలూ తర్వాత తండ్రులూ కూడ మంచి దాతలనిపించుకున్నారు. ఊహ తెలిసేనాటికి ఈ పరిస్థితి యిలాగే ఉండేది. తర్వాత మాకుటుంబాలు విడిపోయాయి. కొందరు చితికి పోయారు. కొందరు బాగు పడ్డారు. మా తండ్రి ముందుచూపుతో నన్ను చదువులో పెట్టాడు.

## విపిన మూర్తి

మాఊరికి అయిదు మైళ్ళ దూరంలో హైస్కూలు ఉండేది. సైకిళ్ళ మీద వెళ్ళేవాళ్ళం. ఈ జగన్నాధం నా సైకిలు తొక్కి మాతో-బాటే వచ్చి చదువుకునేవాడు. ఫస్టుమార్కులతో నేను పాసయేవాడిని. జగన్నాధానికి అత్తెసరు మార్కులు వచ్చేవి.

మా కుటుంబాలలో మేమిద్దరమే చదు-వుకునే వాళ్ళం. కనుక మా యిద్దర్నీ అంతా పొగిడేవారు. వాడు వచ్చి మా వీధరుగు మీదే కూర్చొనేవాడు. దానిమీద మా పెద్దా-ళ్ళంతా పేకాటలు ఆడేవారు. వాళ్ళకి సిగరెట్లూ, కాఫీలూ మోసేవాడు జగన్నాధం. నేను పుస్త-కాలు పట్టుకుని కూర్చునేవాడిని. జగన్నాధానికి పనులు పురమాయిస్తూనే నన్నుగుర్తు చేసి "వాడి చంకనాకు - బాగుపడతావు -" అనేవారు.

నేను కూడా వాడిని చదవమని సతా-యించేవాడిని.

కొడుకు పాసయినపుడల్లా తండ్రివచ్చి 'ఇదంతా నీచలవే -' అనేవాడు. మా అంతస్తుల్లో తేడా ఉన్నా, చదువులో నాకన్నా వెనకబడ్డా, పనికి మాలిన స్నేహాలు వాడు చేసినా, మా యిద్దరి తెలివి తేటల్లో వ్యత్యాసమే అందరూ పట్టించుకునేవారు. 'వాడు ఆఫీసరవుతాడు-



నన్ను బంట్రోతువవుతావు' అని మా యింగ్లీషు మాష్టారు శిరోమణిగారు తిట్టేవారు.

అరవై అయిదు ప్రాంతాల నా చదువు అయిపోయింది.

వాడిది డింకీ కొట్టింది.

నేను డిగ్రీ చేతబట్టుకుని హైదరాబాదు చేరాను. కొన్నాళ్ళు ఒక ప్రైవేటు కంపెనీలో చేసి చివరకి రాష్ట్రప్రభుత్వంలో ఉద్యోగం

సంపాదించగలిగేను. నేను సంపాదించుకుని స్థిరపడుతుండగా జగన్నాథాన్ని వెంటబెట్టుకుని వాళ్ళ నాన్న వచ్చాడు.


చిన్నప్పటిమించీ నన్ను ఎత్తుకుని మోసాడు. జగన్నాథం కూడా ఏవో కొన్ని చిల్లర మల్లర పనులు చేసి మావాళ్ళ చేత తన్నులు తిన్నా కావల్సిన మనిషి.

ఏలా కాదంటాను?

పరేవని వాడిని నా రూమ్‌లో పెట్టుకున్నాను.

చిక్కడపల్లిలో ఉండేవాళ్ళం. నేను మూడునెలలు వాడిని పోషించాను. ఇంటిదగ్గర ఉండేవాడు. నేను ఆఫీసుకు పోయేవాడిని. పోయేముందు అన్నింటికీ తాళాలు వేసుకునేవాడిని. ఏది పట్టుకెళ్ళి అమ్మేస్తాడోనని బెంగ. ఆపని చేయలేదుగాని, ఇంటి ఓనరు కూతురుతో సంబంధం కలిపేసాడు. ఆ అమ్మాయికి నెల తప్పిందని తెలియగానే చెప్పాపెట్ట కుండా రైలెక్కేసాడు.

ఆయన వచ్చి నా పీకల మీద కూర్చున్నాడు.



ఏం చెప్పేది? బ్రాహ్మడు! పెద్దవాడు. మేం ఆయన కులం కాదు.

ఏం చెప్పినా ఆయన వినలేదు - "కులం కాకపోతేనేం మనిషే కదా - నన్ను మీ ఊరు తీసుకువెళ్ళు! నేను పంచాయితీ పెట్టిస్తాను. నువ్వీ ఉపకారం చెయ్యి - " అన్నాడు.

తప్పలేదు. ఆఫీసుకు సెలవుపెట్టి రైలెక్కాను.

జగన్నాథం దొరికాడు.

మావాళ్ళంతా వాడిని పట్టుకుని తన్నారు. కులంలో తప్పబుట్టావన్నారు. చివరకి మెడలువంచి వాడికి పెళ్ళి చేయించారు.

నోరెత్తకుండా పెళ్ళి చేసుకున్నాడు.

ఊళ్ళోకి అడుగుపెడితే కాళ్ళువిరగగొడతామన్నారు.

తండ్రి జగన్నాథం మొహంచూడనన్నాడు.

అప్పటిలో నేను జగన్నాథాన్ని కొంచెం సపోర్టు చేసేవాడిని. - "ప్రేమించాడు! తప్పేముంది" అన్నధోరణిలో మాట్లాడేవాడిని.

"తప్పా....తప్పన్నరా? నువ్వు ఆపని జన్మలో చెయ్యలేవు. తప్పదు నా కొడుకా - !" అనేవారు.

నిజంగానే నేను ప్రేమవ్యవహారంలో పడలేదు. మా వాళ్ళు నిశ్చయించిన అమ్మయిని పెళ్ళాడాను.

ఇలా మా కుటుంబాలలో వాడిని లోకువచేసినా, నన్ను మన్నన చేసినా నేను ఎక్కువ పట్టించుకునే వాడిని కాదు. నా ఉద్యోగమేదో, నా బ్రతుకేదో అన్నట్టుండేవాడిని.

ఆయింటినుంచి అప్పట్లోనే ఖాళీ చేసేసినా రాకపోకలు మాత్రం కొన్నాళ్ళుండేవి. పెద్దాయన అల్లుడినీ, కూతురినీ ఉండమనలేక పొమ్మనలేక సతమతమయిపోయేవాడు. జగన్నాథం దర్జాగా కూర్చుని వేళకి అన్నీ జరిపించుకునేవాడు. ఆ అమ్మాయి పేరు పార్వతి. పచ్చగా బంగారు బొమ్మలా ఉండేది. యస్సెస్సెల్సీ పాసయింది. మొదట్లో నాతో కలివిడిగానే మాట్లాడేది. తర్వాత్తర్వాత నేను వెళ్ళేసరికి చటుక్కున లోపలికి పోయేది. నేనది గమనించాక రాకపోకలు తగ్గించాము.

పెద్దాయన ఎవరికాళ్ళో కడుపో పట్టుకుని సెక్రటేరియట్‌లో గుమస్తాగా జగన్నా-



ధాన్ని వేయించాడు. కూతురికీ, అల్లుడికీ వేరే కాపురం పెట్టించాడు. బాగుండదని వెళ్ళాను. పార్వతి బాగా చిక్కిపోయింది. జగన్నాథం లేడు.

ఆ అమ్మాయి బావురుమంది.

నేను నివ్వెరపోయాను. నన్ను పట్టుబట్టి ఉంచేసింది. ఆమె చెపుతూ ఉంటే గుండె చెరువయిపోయింది. 'జగన్నాథం ఇంతనీచుడా-' అని ఆశ్చర్యం కలిగింది. జగన్నాథానికి అనుమానంట. ఇంటికొచ్చే కూరలవాళ్ళతో కూడా సంబంధం కట్టేవాడట. 'నిండుచూలాలిని. ఇప్పుడు కూడా నన్ను అనుమానిస్తాడంటూ' పార్వతి చెపుతూంటే ఒళ్ళుపట్టని కోపం వచ్చింది. వాడి ఫీల్టు పట్టుకుని ఈదవడా ఆదవడా వాయిస్తానన్నాను. వాళ్ళ నాన్నను పిలిపించి చెప్పుతో కొట్టిస్తానన్నాను.

అలా చేసినా బాగుండేది - పార్వతిదక్కేది!

'వద్దన్నా' అంటూ ఏడిచింది. ఇదంతా వాళ్ళ నాన్నకు రాసాను. ఆయన సమయానికి రాలేకపోయాడు. ఒకరోజు పార్వతి కాలుజారిపడిపోయిందనీ, చావుబతుకులమీద ఉందనీ తెలిసింది నేను వెళ్ళేసరికే అంతా అయిపోయింది.

ఆ తర్వాత జగన్నాథం మొహం నేను చూడలేదు.

అయిన వాడి కబుర్లు తెలుస్తూనే ఉండేవి.

అప్పట్లో హైదరాబాదుకి ఆంధ్రానుంచి జనం చేరుకునేవారు. రకరకాల గొడవలు. ముల్కీ నాన్ ముల్కీ తగువులు. జగన్నాథం మా జిల్లాలనుంచి వచ్చే వాళ్ళకి ఏవో సదుపాయాలు చేస్తున్నాడని తెలిసేది. ఇళ్ళస్థలాలు కొంటున్నాడనీ, అమ్ముతున్నాడనీ అనేవారు. నాకు తెలిసి అతని జీతం నాకన్నా తక్కువే! ఎలాంటి ఆస్తీపాస్తీ కూడాలేవు. అయినా ఇళ్ళస్థలాలు కొనేంత డబ్బు ఎక్కడిది?

బలుస్తున్న భాగ్యనగరంలో డబ్బుచెట్లు మొలవటానికి ఇళ్ళస్థలాల వ్యాపారం చాలాసారవంతమయిన నేల! ఆంధ్రానుంచి వచ్చేవాళ్ళకి అండాదండా జగన్నాథాల్లాంటి వాళ్ళు సమకూర్చేవారు.

జగన్నాథమంటే తెలిసీ, తెలియని వాళ్ళు అతగాడిని ఆశ్రయించవచ్చు. అంతా తెలిసిన మా వాళ్ళు ఆపని చేయరని నేను కాస్త గర్వంగా అనేవాడిని.

డబ్బయినాలుగులో మా చిన్నాన్న తన కొడుకుని తీసుకువచ్చి 'ఏదయినా ఉద్యోగం సూడరా - అబ్బాయ్!' అని నాకు అప్పగించేడు. నాభార్య నెమ్మదయినదే! నలుగురున్న కొంపలోంచి వచ్చినదే! చాకిరీకి వెరవదు! ఉండటానికి కూడా సదుపాయం వున్న యిల్లే! కనుక వాడిని ఏడాది పాటయినా దగ్గర పెట్టుకోగలము. కానీ ఉద్యోగం వేయించటమంటే - మాటల్తోపనా? నన్ను ముట్టుకోకు నా మాలకాకి అన్నట్టుండే నాకు అది సాధ్యమా?

నా బెదురు నేను వ్యక్తం చెయ్యలేదు.

మూడునెలల తర్వాత వాడు వెళ్ళి చిన్నాన్నను వెంటబెట్టుకొని వచ్చాడు. తండ్రీ,కొడుకూ రెండు రోజులు అడావుడిగా తిరిగారు. నాతో వాళ్ళు ఏం మాట్లాడలేదు. నేనూ అడగలేదు.

"జగన్నాథంరా మనిషంటే - " అన్నాడు చిన్నాన్న వెళ్ళేముందు. ఏమాత్రం సూచన లేకుండా వచ్చిన ఆ ప్రస్తావనతో నివ్వెరపోయాను. ఆరోజు చెప్పు తీసుకుని జగన్నాథాన్ని చచ్చేలా కొట్టాడు చిన్నాన్న. ఆయనంటే పిల్లలందరం జడుసుకునేవాళ్ళం.

నేను ఎలాంటి ఆసక్తీ చూపించకపోయినా చిన్నాన్న విషయం చెప్పాడు. జగన్నాథం మావాడికి ఉద్యోగం వేయిస్తానన్నాడట. మూడు వేలు పట్టుకొచ్చి యిచ్చారుట. నాతో ఒక్కముక్క కూడా అనకుండా వాళ్ళుచేసిన పని నాకు బాధ కలిగించింది.

అన్నట్లుగా వారం రోజుల్లో ఆర్డరు రాకపోయినా, రెండు మూడు నెలలో ఉద్యోగం దొరికింది. అప్పటినుంచీ జగన్నాథం కోసం మా వాళ్ళు రావటం, మా యింట్లో మకాం వేయటం మొదలయింది. వచ్చిన వాళ్ళు పనులు చేసుకొని వెళ్ళిపోతున్నారా- జగన్నాథాన్ని ఇంద్రుడూ చంద్రుడూ అంటున్నారు. మా ఆవిడ ఆ మనిషిని ఎన్నడూ చూడలేదు.

నా భార్య ఓ మారు పెదవి విప్పింది. అప్పుడు జగన్నాథాన్నీ నన్నూ పోల్చి చూస్తున్నారని నాకు అర్థమయింది. ఈసారి పోలిక నాకేమంత సుఖకరంగా లేదు. వాడు యిల్లుకట్టాడు! నేను కట్టలేదు. వాడికి పరోపకార బుద్ధిఉంది. నాకులేదు. వాడి భార్య మంచి ఆదరణ గల యిల్లాలు. వాడి పిల్లలు బహు బుద్ధిమంతులు.

'మీరూ వాళ్ళలా చదువుకోండి-' అని మా పిల్లలతో అన్నారట.

నా వంట్లో చీమూ నెత్తురూలేదు- అవన్నీ తెలివి తక్కువతనంగా అంటున్నారు- అని సర్ది-చెప్పబోయాను.

ఆవిడ ఊరుకోలేదు.

"మనయింటి మీదపడి తింటున్నారు. నా పిల్లల చేత సిగరెట్లు తెప్పించుకుంటున్నారు. వాళ్ళని పొగడడమేంటి? ఉంటే మనసులో ఉంచుకోవాలి-"

నేను నచ్చజెప్పాను- 'మనమంచికోరే' వాళ్ళుగనకే చెపుతున్నారు. వాడికన్నా ముందు వాడికన్న పెద్ద ఉద్యోగంలో చేరాను. వాడికన్నా నేను బాగుండాలి. అలాలేను. పల్లెటూరివాళ్ళు. మాట్లాట్టంరాదు. ఏదో అన్నారు. వదిలెయ్?'

ఆవిడ వదిలేసింది. బంధువులు వదల-లేదు.

కొందరి పనులు అయేవి. కొన్ని అయేవి-కావు. 'అన్నీ మనవాళ్ళకే చేసుకుంటే బాగోదు-' అని తప్పించుకునేవాడు. అదీ ఉత్తమగుణంగానే కొందరు చిత్రించేవారు.

"వాడికి కులం, మతం లేవు- ఆంధ్రా-వోళ్ళు అవాలంతే!" అనేవారు అది వాళ్ళ వాఖ్యానం. నేను కూడా అందులో పడ్డాను.

నేను చాలా ఆదర్శభావాలున్న వాడిననీ, నిజాయితీకి ప్రాణం యిస్తాననీ, లంచం ముట్ట-ననీ నామీద వాకు చాలాగౌరవం ఉండేది. అందుకే నా పరిస్థితియిలా ఉంది. అప్పటికీ పదహారేళ్ళు సర్వీసు పూర్తయింది. రాజధా-నిలో రాష్ట్రప్రభుత్వోద్యోగిని. ఒకటేగాదు రెండు యిళ్ళు కట్టిన వాళ్ళున్నారు. బాంక్ అక్కా-వుంట్లో బోలెడంత ఉన్నవాళ్ళున్నారు. షేర్లు, యఫ్‌డీలు ఉన్నవాళ్ళున్నారు. కర్ణాటకలో లక్షలు పెట్టి కొడుకులకి డాక్టరీ, యింజ-నీరింగూ చెప్పిస్తున్న వాళ్ళున్నారు. నా పెద్దకొడుకుని అప్పట్లో బియస్సీలో చేర్చటం గగనమయిపోయింది.

లోకంలో సఫలమయిన వాళ్ళతో నన్ను అందరూ పోల్చారు. నేనూ అదే పనిచే-స్తున్నాను. వాళ్ళు నైతికంగా వాకన్నా తక్కువ్వాళ్ళని నేను గర్వపడ్డా దాన్ని లోకం నిలవనీయటం లేదు. దాన్ని సమర్థత అనే




తూనికరాయితో తూస్తోంది.

నల్లకుక్క నల్లకుక్క అని నలుగురూ అనేస-రికి నిజమేననుకున్నాడట వెనకటికి ఓ అయ్యా-వారు. నేను సమర్థుడిని కానని నాకూ అనిపిస్తోంది.

ఈ స్థితిలో మా జగన్నాథంలో ఆంధ్రాభి-మానమేగాని కులాభిమానం లేదన్న వ్యాఖ్యానం నాకు అతనిమీద గౌరవమే కలిగించింది. ఇదంతా పదేళ్ళ క్రితం మాట! అప్పటికే కులాల పేరిట సంఘాలు మొదలయాయి. నగరాలలో ఉద్యోగం చేసుకునే నాలాంటి వాళ్ళకి ఎదురయే చావూ, పెళ్ళీ లాంటి సమస్యలకు అవి కొంత పరిష్కారం అయేవి. నన్ను కూడ సభ్యులు అవమనేవారు.

నేను అవలేదు. అవకపోవటమే కాదు - అయినవాళ్ళు ఏదో తప్పుడు పని చేస్తున్నా-రని అనుకునేవాడిని. అలాంటిపని జగన్నాథం చేయనందుకు నేను సంతోషించాను.

రామారావు గాలి రాజకీయాలలో వీస్తోంది. ఆయన వచ్చి మొత్తం అంతా బాగుచేసేస్తాడని అందరం అనుకున్నాం. బాగు చెయ్యాలనుకు-న్నాడా లేదా; చేయలేకపోయాడా చెయ్య లేదా అన్న మీ మాంస అనవసరం.

ఆయన వచ్చిన కొత్తలో మా ప్రభుత్వ కార్యాలయాలలో వచ్చిన మార్పు నాకు ఎన్నో ఆశలు కలిగించింది. నా వంటి వాళ్ళకి సువ-ర్ణావకాశాలు వస్తాయని కూడా అనుకున్నాను.

ఎక్కడ ఏంజరిగిందో తెలియదు. రామా-రావు రెండవమారు పదవిలోకి వచ్చాక కళ్ళేలు ఎవరి చేతుల్లో ఉన్నాయో అర్థం కాకుండా పోయింది. మా కార్యాలయాలు మళ్ళీ జనస-మ్మర్దమయిపోయాయి. టేబిళ్ళ మీదే బేరసా-రాలు జరిగిపోతున్నాయి.

ఒకప్పుడు ధనం మాత్రమే పనిచేసేదని నా నమ్మకం. ఇప్పుడు కులం పనిచేస్తోందని వింటున్నాను. దానికి తార్కాణం మాత్రం నాకు దొరకలేదు. ధనం పేరు చెప్పటానికి సిగ్గు పడేవాళ్ళు. కులం పేరు గర్వంగా చెప్పటం విని నేను ఆశ్చర్యపోయాను.

జగన్నాథం దాదాపు పదిహేడు ఏళ్ళ తర్వాత నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. నా ప్రమోషన్ దగ్గర పీటముడి పడిపోయింది. అది రావాలని నాకు ఉంది. రాకపోతే తల తీసేసినట్టుగా కూడా ఉంటుంది.

వచ్చిన మనిషిని నేను ఒకప్పుడయితే అవ-మానించేవాడినే! ఇప్పుడా ఆసక్తిలేదు. ఓపికా-లేదు.

జగన్నాథాన్ని దగ్గరనుంచి చూసాను. శారీరకంగా పెద్ద మార్పులేదు. మాటలో వ్యవహారశైలిలో కూడా నాకు కనిపించలేదు. సమర్థులకు సహజమయిన ఆత్మ విశ్వాసం ఏదో ఉంది. చాలా కలుపుగోలుగా మాట్లా-

డాడు. సూటిగా విషయంలోకి వచ్చాడు. నాకు ప్రమోషన్‌రాదుట.

నాకూ తెలుసునన్నాను బింకంగా!

ఎందుకు రాదనుకుంటున్నావన్నాడు!

సెక్రటరీ స్థాయిలో ఉంది నాఫైలు. ఆయన మనవాడు కాదు అన్నాను. 'మనవాడు' అన్నమాట నన్ను ఒకప్పుడు చాలా బాధ పెట్టేది. ఆ క్షణంలో కూడా ఆమాట అంతో యింతో బాధ పెట్టింది.

జగన్నాథం నవ్వాడు - 'నువ్వు కూడా నలుగురితో బాటు నడువు! నువ్వు గడ్డి తినకపోతే మానెయ్! తినిపించలేకపోతే మానెయ్! కాని నువ్వేమిటో నువ్వు గుర్తు చేయాలి! లేపోతే నీకు దక్కాల్సినది దక్కదు ----' అన్నాడు.


వాడిస్తున్న సలహా స్పష్టంగానే ఉంది నేను మా కుల సంఘంలో చేరాలి. చేరటమేకాదు చేరినట్లు దండోరా వేయించుకోవాలి. మా కులంలో బీదవాళ్ళకు సహాయం చెయ్యాలి! అదీ మంచి పనేగదా!

వాడెప్పుడు ఆంధ్రుడిమంచి కులం పుచ్చుకున్నాడో నాకు తెలియదు. ఈ ట్రస్టూ ఆ నిధీ అంటూ మావాళ్ళ మంచి చందాలు పోగుచేసి వాడు మింగుతున్నాడో, ఉపకారాలు చేస్తున్నాడో నాకు తెలియదు. ఆ వివరాలు నేను అడగలేదు.

నాకు అర్థం కానిది వాడి లాజిక్!

నా ఫైలున్న అధికారి మావాడు కాదు! కానప్పుడు నేను కులనాయకుడినవటం వల్ల నాపనెలా అవుతుంది.

" - కులస్తుడవటం వల్ల ఉపకారాలు జరిగిపోతాయనుకుంటున్నావా? నీ పొజిషన్‌కి నువ్వు యీ పాటికి కొంత బలాన్ని పోగుచేసుకుని ఉండాలి. అది ఉన్నప్పుడు నువ్వంటే బెదురే కాదు. గౌరవం కూడా ఉంటుంది. ఆ బెదురుతోటే నీకు అపకారం చెయ్యటానికి జడుస్తారు. నువ్వు ఏ తీగలు లాగి ఏ డొంకలు కదపగలవో ఎవడికీ తెలవదు. కనుక ఏవోతీగలు లాగగలవని ఎదుటివాడికి అనుమానం పుట్టించాలి. కనీసం నువ్వు ఆపనిచేస్తే నీకు దక్కాల్సినది దక్కుతుంది.




"--కులస్తుడవటం వల్ల ఉపకారాలు జరిగిపోతాయనుకుంటున్నావా? నీ పొజిషన్‌కి నువ్వు యీ పాటికి కొంత బలాన్ని పోగుచేసుకుని ఉండాలి. అది ఉన్నప్పుడు నువ్వంటే బెదురే కాదు. గౌరవం కూడా ఉంటుంది. ఆ బెదురుతోటే నీకు అపకారం చెయ్యటానికి జడుస్తారు. నువ్వు ఏ తీగలు లాగి ఏ డొంకలు కదపగలవో ఎవడికీ తెలవదు. కనుక ఏవో తీగలు లాగగలవని ఎదుటివాడికి అనుమానం పుట్టించాలి! కనీసం నువ్వు ఆ పని చేస్తే నీకు దక్కాల్సినది దక్కుతుంది-"

నేను ఆలోచించుకుంటానన్నాను. జగన్నాథం నా భార్యని కూడా కదిపి వెళ్ళాడు. నా ఆలోచనలు తెగలేదు. ఎదురుగుండా ఉన్న కులాన్ని నమ్మాలో ఉన్నాడో లేదో తెలీని దేవుడిని నమ్మాలో తెలీలేదు. ఇన్నాళ్ళు ప్రత్యర్థిగా ఉన్న జగన్నాథాన్ని నమ్మాలో నాలోపల ఉన్న మంచి పట్ల నిర్వచనాన్ని నమ్మాలో తెలీలేదు.

భగవంతుడో! మంచో! నా సమస్య పరిష్కరించబడింది. పీటముడి విడింది. ప్రమోషన్ దొరికింది. నేను మాత్రం దానికి క్రెడిట్‌ని ఒకప్పుడయితే మంచికి యిచ్చేవాడిని. ఇప్పుడు భగవంతుడికి యిచ్చాను.

ఈ కథ అంతటితో అవలేదు.

మళ్ళీ నాకు సమస్యలు వస్తూనే ఉన్నాయి. నా ప్రమోషన్లూ, నా యిల్లుకట్టే ప్రయత్నాలూ, నా పిల్లల చదువులూ, ఉద్యోగాలు!

అప్పుడప్పుడు జగన్నాథం కలుస్తూనే ఉన్నాడు.

నిజం చెప్పొద్దూ - నేను వెళ్తూనే ఉన్నాను.

వెనక వాడిపట్ల అందరికీ ఉండే లోకువా, నాకుండే మన్ననా పోయాయని నాకు కొంత దుగ్ధ ఉన్న మాట నిజమే! యిప్పటికి కూడా వాడు నాకన్న తక్కువే! ఆమాట ఎవరూ నాతో అనకపోవచ్చు. నాకు నేనైనా నా విజయాలీవి మెచ్చుకుంటున్నానా? సందేహమే!

వాడిప్పుడు మా కులానికి మార్గదర్శకుడు. మణిదీపం. వెనకటి శతాబ్దాల చారిత్రక ప్రసిద్ధులు మా కులస్తులేనన్న ప్రచారం నాబోటి వాళ్ళకు ఎంత కాదనుకున్నా భుజాలు పొంగించకుండా ఉంటుందా? ఇలా వాళ్ళను మాకు హక్కు భుక్తం చేస్తున్న జగన్నాథం లాంటి వాళ్ళు ముందుకు పొగుతూనే ఉన్నారు. వాళ్ళ విజయాలు నాబోటి వాళ్ళకు కూడా పోరూరిస్తూనే ఉన్నాయి.

నేనూ వాడితో బాటు నడవక తప్పేట్టు లేదు. నాకున్న ఉద్యోగస్థాయిని బట్టీ, జగన్నాథంతో పరిచయాన్ని బట్టీ కుల సంఘంలో ఏదో చిన్నదో పెద్దదో పదవి దక్కవచ్చు. దానివల్ల

ఎవరి సమస్యలు తీరినా మానినా నా సమస్యలు మాత్రం తీరతాయి.

ఇలా అనుకుంటే ఉక్రోషంగా ఉంటుంది.

అలాంటి ఊగిసలాటలో, ఉక్రోషంలో నేను మా ఊరు వెళ్ళాను. జగన్నాథం తండ్రి మంచం మీద ఉన్నాడుట!

"ఏం పట్టుదలరా ముసిలాడికి! జగన్నాధానికి పెళ్ళయిన దగ్గర నుంచి యియ్యేల దాకా వాడి మొహం చూడలేదు ----" అన్నాడు చిన్నాన్న. తన కులస్తుడే అయినా, తన పొలంలో పనిచేసిన వాడికి అంత పట్టుదల ఉండడం అవమానంగా భావిస్తున్నట్టున్నాయి చిన్నాన్న మాటలు.

పల్లెటూరివాడు! ఆయన ధోరణి అది! నాకుమాత్రం - వాడికీ, ఈ ముసిలాడికీ కులగజ్జి అనుకున్నాను. అలా అనుకోవడం కాస్త తృప్తి కలిగించింది.

వెళ్ళి పలకరించాను.

గుర్తు పట్టాడు. జగన్నాధం సంగతి ఎత్తాను. మొహం తిప్పేసాడు.

"వాడు నీ కులాన్ని భ్రష్టం చేసాడని నీ కోపం! వాడు నీ కొడుకు! వయసులో ఏదో చేసాడు! ఇప్పుడు మన కులాన్ని ఎంత బాగుచేస్తాన్నాడో తెలుసు!" అన్నాను నా కసిని అణుచుకుంటూ

ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. బలహీనమయిన చేతితో నా చేతిని నొక్కాడు. గొంతు కూడ దీసుకున్నాడు.

" -- ఛత్ : తప్పుడెదవ : ఏ ఆడకూతుర్ని పొట్టనెట్టుకున్నాడు! నా కులంలో తప్పబుట్టాడు! ఆ యెదవ నా కొడుకు కాదు - నా కులం కాదు - "

ఆ ముసిలాయన మాటలవే!

ఆ గొంతుకా, మాటా నన్ను నిలదీసి ప్రశ్నించాయి.

"నీతికి నిర్వచనం ఎవరూ ఖచ్చితంగా చెప్పలేకపోవచ్చు. కానీ, అది ఏమిటో ప్రతి వాళ్ళకూ తెలుసు. తెలిసినదానిని పాటించడానికి మాత్రం సత్తువ ఉండాలి. నాకా సత్తువ నా కులమే యిచ్చింది. కులం లేదంటావు నువ్వు. ఉండరాదంటావు నువ్వు. నీకు తెలిసిన దానిని పాటించడానికి నీకు సత్తువ ఎందుకు లేదు? అది నీ నీతి లోపమా? నీలోపమా?"

ఆ ప్రశ్నతో నా ఊగిసలాట ఆగిపోయినట్లయింది.

నాకేదో కొత్త ఆధారం దొరికినట్లయింది.

అది పట్టుకుని నేను నగరం బస్సు ఎక్కాను.

★

